నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | ఏప్రిల్ 18, 2024 | www.navatelangana.com

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని పల్లి(బి) గ్రామ మాజీ సర్పంచ్ కుమ్ర మల్కు పటేల్, సొసైటీ డైరెక్టర్ లోక లింగారెడ్డితో పాటు పలువురు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి, జడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి, కళ్యాణం రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ బాబన్న, నాయకులు కొండ గంగాధర్, వెంకన్న, సోమన్న, శ్రీధర్, మాజీ సర్పంచులు నర్సిములు, విఠల్, సంజీవ్, గంగన్న, నగేష్, గిమ్మ సంతోష్ పాల్గొన్నారు.



రూ.2లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-బేల

మండలంలోని శంకర్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.2లక్షల నగదు పట్టుబడింది. హైరి నుండి నాందేడ్ వెళ్తున్న కారు(ఎంహెచ్ 33ఈ7963)లో నగదు తరలిస్తున్నారు. దీనికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో నగదును ఎఫ్ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు ఎస్ఐ రాధిక తెలిపారు.



పోరు మరింత హోరు..!

- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
- ముహూర్త బలం చూసుకుంటున్న అభ్యర్థులు
- పల్లె, పట్టణాల్లో ఉధృతం కానున్న ప్రచారం
- సభలు, సమావేశాలకు రాజకీయ పార్టీల ప్రణాళిక
- ఎన్నికల ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం

ఆదిలాబాద్ లోక్‌సభ సమరం మరింత రసవత్తరంగా మారనుంది. ఇన్నాండ్లు నాయకులు, కార్యకర్తలతో సమావేశాలకే పరిమితమైన రాజకీయ పార్టీలు ఇక నుంచి క్షేత్రస్థాయి ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నాయి. గురువారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానుండటంతో రాజకీయ పార్టీలు బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల సమరంలో పోరాడటమే తరువాయిగా మారింది. నామినేషన్లకు ఈ నెల 25వ తేదీ వరకు సమయం ఉండటంతో అభ్యర్థులు ముహూర్త బలం చూసుకుంటున్నట్లు తెలుస్తోంది. మంచి రోజు చూసి నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతుండగా.. అధికార యంత్రాంగం ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమై ఉండగా.. అటు రాజకీయ పార్టీలు సమరంలో నెగ్గేందుకు వివిధ రకాల ప్రయత్నాలు ప్రారంభిస్తుండటం ఆసక్తికరంగా మారుతోంది.


ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట బారికేడ్ల ఏర్పాటు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

లోక్‌సభ సమరం మరింత వేడెక్కుతోంది. ఆదిలాబాద్ లోక్‌సభ సీటును కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రధాన పార్టీలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. గత నెల రోజులుగా ఆయా పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు మండల కేంద్రాలు, ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల బరిలో నిలిచేందుకు సమాయత్తం కాగా.. ఇక నుంచి ఆయా రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించనున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో క్షేత్రస్థాయి ప్రచారాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నాయి. వాహనాల ద్వారా ప్రచారం చేయడంతో పాటు మైకుల మోతల ద్వారానూ ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతుండటం ఆసక్తికరంగా మారుతోంది. మే 13న పోలింగ్ జరగనుండటంతో ఈ ఇరవై రోజుల వ్యవధిలో లోక్‌సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం ముమ్మరం చేయాలని భావిస్తున్నాయి. ఎక్కడికక్కడ ప్రత్యేక వాహనాల ద్వారా మైకుల మోతలతో ప్రచారం చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్ నుంచి ఆత్రం సుగుణ, బీఆర్ఎస్ నుంచి ఆత్రం సక్కు బరిలో నిల్చుండగా.. బీజేపీ నుంచి గోడం నగేష్ బరిలో ఉండనున్నారు. మరికొందరు గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఆయా పార్టీల అగ్రనేతలను రప్పించి భారీ సభలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది.

ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం..!

ఎన్నికల సమరంలో పాల్గొనేందుకు రాజకీయ పార్టీలు సిద్ధం కాగా.. వాటిని నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సైతం అదే స్థాయిలో సంసిద్ధమవుతోంది. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ప్రక్రియను పూర్తిచేసింది. పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, ఎన్నికల అధికారులు, సిబ్బంది నియామకాన్ని సిద్ధం చేసింది. లోక్‌సభ పరిధిలో 2111 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. మరో 88 ఆగ్జలరీ కేంద్రాలను ఏర్పాటుచేసింది. వీటి పరిధిలోని 132 ప్రాంతాల్లోని 252 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది. మిగితా ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన పోలిస్ యంత్రాంగంతో భారీ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. తనిఖీ బృందాల ద్వారా డబ్బు, మద్యం, గంజాయి తదితర వాటిపై నిఘా వేసి పట్టుకుంటూ ఉక్కుపాదం మోపుతుండటం ఆసక్తికరంగా మారింది. తాజా లోక్‌సభ ఎన్నికలకు ఇటు అధికార యంత్రాంగం..అటు రాజకీయ పార్టీలు సమాయత్తం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాజీ మంత్రి కేటీఆర్ ఆదిలాబాద్ వేదికగా మాట్లాడిన మాటలను, సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ తీరుపై ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల తర్వాత పదేపదే బీజేపీలో చేరుతారని బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేయడం మానుకోవాలని హెచ్చరించారు. అధికారం కోల్పోయాక జీర్ణించుకోలేకనే అసహనంతో ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. వెనుకబాటుకు గురైన ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేశారంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రిని, కాంగ్రెస్ పార్టీని పనిగట్టుకుని బద్నాం చేయాలని చూస్తే ఊరుకోబోమని, తమ తడాఖా చూపిస్తామని అన్నారు. తెలంగాణ ద్రోహులను పార్టీలో చేర్చుకుని మంత్రి పదవులు కట్టబెట్టి నిజమైన తెలంగాణ ఉద్యమకారులను విస్మరించిందని బీఆర్ఎస్ కాదా అంటూ నిలదీశారు. వాస్తవంగా బీజేపీతో దోస్తానా చేసిందే బీఆర్ఎస్ అంటూ వ్యాఖ్యానించారు. కేంద్రంలో బీజేపీ నల్లచట్టాలు తీసుకొచ్చినప్పుడు మద్దతు తెలిపి మౌనం వహించింది మీరు కాదా అంటూ ఆగ్రహించారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటే మౌనం వహించారన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత భరించలేకనే రైతులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రెండు లక్షల రుణమాఫీ ఏమైందంటూ బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించడం సిగ్గుచేటన్నారు. ఇచ్చిన హామీలకు తాము కట్టుబడి ఉన్నామని, ఒక్కోక్కటిగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఖజానా మొత్తం ఖాళీ చేసి ఇప్పుడు హామీలను నెరవేర్చడంలేదని ఉల్టా చోర్ కొత్వాల్‌కు డాటే అన్న చందంగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై అభాండాలు మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా

బీఆర్ఎస్ ప్రభుత్వం అసలు ఏ ప్రాంత అభివృద్ధికి ఏం చేసిందంటూ ప్రశ్నించారు. ఇప్పటికీ అనేక ఆదివాసీ గిరిజన గ్రామాలు, మారుమూల పల్లెల్లో తాగునీటికి కష్టాలు తప్పడంలేదన్నారు. మిషన్ భగీరథ పేరు మీద కోట్ల రూపాయలు కమీషన్లు తీసుకుని ఇంటింటికీ నల్లా నీటిని అందించామని గొప్పలు చెప్పుకోవడం బీఆర్ఎస్‌కే చెల్లిందని ఘాటుగా విమర్శించారు. నిజంగా నీటి సమస్యకు పరిష్కారం చూపి ఉంటే పల్లెల్లో తిరుగుదామని, అదే నిజమైతే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్‌పై లేనిపోని ఆరోపణలు చేసి వచ్చే ఎన్నికల్లో మళ్లీ లబ్ధిపొందడానికి యత్నిస్తున్నారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఈ ప్రాంతానికి చేసేందేమీలేదని, వారికి ఓట్లు వేసి మళ్లీ మళ్లీ మోసపోవద్దని ఓటర్లను కోరరాు. విలేకరుల సమావేశంలో డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి, తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, మాజీ జడ్పీటీసీ బొల్లారం బాబన్న, మాజీ మున్సిపల్ ఛైర్మన్ దిగంబర్‌రావు పాటిల్, కొండ గంగాధర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వామన్ వాంఖడే, ఆదిలాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ షెడ్మకి ఆనంద్‌రావు, కౌన్సిలర్ జాఫర్ అహ్మద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, భరత్ వాగ్మారే, శ్రీలేఖ, నాగర్కర్ శంకర్, కల్లెం భూమారెడ్డి, బండి దేవిదాస్, దుర్గం శేఖర్ పాల్గొన్నారు.

డీఎస్పీ ఎంపీ అభ్యర్థిగా కృష్ణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లోక్‌సభ ఎన్నికల బరిలో ధర్మ సమాజ్ పార్టీ ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. బజార్‌హత్నూర్ మండలం గులాబీ తండాకు చెందిన పవర్ కృష్ణ పార్టీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్, ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా రీజినల్ ఇన్‌ఛార్జి సుమన్ మహారాజ్ ఆదేశానుసారంగా ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పవర్ కృష్ణ పోటీలో ఉంటున్నట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల పక్షాన 93శాతం ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల విముక్తి కోసం ధర్మ సమాజ పార్టీ నిరంతరం ఉద్యమిస్తుందని తెలిపారు. పేదల బతుకులు మారాలంటే అణగారిన కులాలు పార్లమెంట్‌లో ఉండాలని, ఆ దిశగా ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పవర్ కృష్ణ బరిలో ఉంటున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు కృష్ణకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బోథ్ నుండి స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ఉయిక హీరాజీ పార్టీలో చేరారు. సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు బడుగు రాజేశ్వర్, నలగంటి రవి పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని మాల సంఘ భవన నిర్మాణనికి నిధులు కేటాయించాలని కోరుతూ దళిత సంఘ నాయకులు బుధవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఏమ్మెల్యే పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యంరెడ్డి, అడ్వాల రమేష్, సుధీర్, మహేష్, భాస్కర్, రాకేష్, నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ ఆర్గనైజర్ ఇన్‌చార్జిగా రవి

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గం కాంగ్రెస్ సేవాదళ్ ఆర్గనైజర్ ఇన్చార్జిగా మండల కేంద్రానికి చెందిన సల్ల రవిని నియమిస్తూ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తను గుర్తించుకొని సముచిత స్థానం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టినందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

'హస్త'గతమే లక్ష్యంగా..!

- ఈ నెల 22న జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి రాక
- అభ్యర్థి నామినేషన్ దాఖలుకు హాజరయ్యే అవకాశం
- ఆదిలాబాద్‌లో సభ నిర్వహించేందుకు ప్రయత్నాలు
- రసవత్తరంగా మారుతున్న ఎన్నికల సమరం



ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాన్ని హస్త గతం చేసుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. ఆ పార్టీ అగ్ర నాయకత్వం కూడా ఆ దిశగానే ఆలోచన చేస్తున్నట్లు కనిపిస్తోంది. తాజాగా ఈ నెల 22వ తేదీన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లాకు రానున్నట్లు తెలుస్తోంది. అదే రోజున కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్ దాఖలు చేయనున్న దృష్ట్యా ఈ కార్యక్రమానికి స్వయంగా సీఎం హాజరుకానున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సీఎం పర్యటన అధికారికంగా ఖరారు కాకపోయినా.. ఆ పార్టీ నేతలు మాత్రం ఏర్పాట్లు చేస్తుండటం.. అనుమతి కోసం దరఖాస్తు చేయాలని భావిస్తుండటం సీఎం రాకకు బలం చేకూరుస్తోంది. ఆదిలాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు భారీగా జన సమీకరణకు ప్లాన్ చేసుకోవాలని ఆ పార్టీ అగ్రనేతలు స్థానిక నేతలకు సూచించినట్లు తెలిసింది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతోంది. ఇక్కడ అధికంగా ఎంపీ సీట్లు గెలుచుకొని మరింత పట్టు నిలుపుకోవాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ స్థానాన్ని సైతం కైవసం చేసుకోవాలని గట్టిపట్టుదలతో ఉంది. ప్రస్తుతం బీజేపీ చేతిలో ఉన్న ఈ సిట్టింగ్ స్థానాన్ని చేజిక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తోంది. అభ్యర్థి ఎంపికలోనూ ఆచితూచి అడుగులు వేసిన కాంగ్రెస్ అధిష్ఠానం చివరకు ఆదివాసీ తెగకు చెందిన ఉపాధ్యాయురాలు, సామాజిక ఉద్యమకారిణి ఆత్రం సుగుణను ఎంపిక చేసి ఈ స్థానం నుంచి నిలబెడుతోంది. గెలుపే లక్ష్యంగా ఇప్పటికే మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ప్రతిష్టాత్మకంగా తీసుకోగా.. ఇప్పటికే ఆయా నియోజకవర్గాలకు చెందిన ఇతర పార్టీలకు చెందిన కీలక నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ద్వారా బలోపేతం దిశగా కృషిచేస్తున్నారు. తాజాగా అభ్యర్థి సైతం ఇప్పటికే మారుమూల గ్రామాల్లో పర్యటిస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ స్థానంలో విజయం సాధించేందుకు కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ సైతం ప్రత్యేక దృష్టిసారిస్తోంది. ఈ పార్టీ నుంచి ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు బరిలో ఉండనున్నారు. ఆయనకు మద్దతుగా రెండు రోజుల క్రితమే ఆదిలాబాద్‌లో పార్లమెంటు స్థాయి నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించగా.. ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్) హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ స్థానంలో గెలుపు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని విజయంపై దృష్టిసారించాలని ఆ పార్టీ శ్రేణులకు పిలుపునివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీజేపీ ఇక్కడ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావును కాదని.. బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన మాజీ ఎంపీ గోడం నగేష్‌కు టికెట్ కేటాయించింది. ఈ స్థానంలో మరోసారి విజయం సాధించేందుకు గట్టి ప్రయత్నాలు ప్రారంభించడం ఆసక్తికరంగా మారుతోంది.

భారీ బహిరంగ సభకు ప్లాన్..!

ఆదిలాబాద్ జిల్లా నుంచే అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించి ఆ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. అదే సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇదే ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన ఇంద్రవెల్లిలో తెలంగాణ పునర్నిర్మాణం పేరిట సభ నిర్వహించి లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని కూడా ఇక్కడి నుంచే పూరించారు. తాజాగా ఆ పార్టీ అభ్యర్థి నామినేషన్ సందర్భంగానూ జిల్లాలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ నిర్వహించడం ద్వారా సత్తాను చాటాలని ఆ పార్టీ భావిస్తోంది. ఇందులో భాగంగానే మరోసారి సీఎం వస్తే ప్రజల్లో మంచి క్రేజ్ వస్తుందని.. తద్వారా పార్టీ అభ్యర్థి విజయానికి మరింత మేలు చేకూరుతుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక నేతలకు అధిష్టానం నుంచి వచ్చిన సూచనల మేరకు సభ కోసం అనుమతి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. సుమారు లక్ష మంది జనసమీకరణకు ప్లాన్ చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం అధికారికంగా ఖరారు కాకపోయినా తప్పకుండా సీఎం వచ్చే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఇలా ఆయా పార్టీల అగ్రనేతల రాకతో ఆదిలాబాద్ లోక్‌సభ సమరం మరింత రసవత్తరంగా మారే అవకాశం కనిపిస్తోంది.

నేటి నుండి నామినేషన్లు షురూ

- కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం
- 16లక్షల ఓటర్లు, 2199 పోలింగ్ కేంద్రాలు
- ఇప్పటి వరకు రూ.32లక్షలకుపైగా సీజ్
- వృద్ధులు, వికలాంగులకు ఇంటి నుండే ఓటు వేసే వెసులుబాటు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా నేటి నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 18 నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆర్ఓ కార్యాలయంలో 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 26న స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. జూన్ 6తో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు.

16 లక్షలకుపైగా ఓటర్లు

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలున్నాయన్నారు. ఏడింటిలో 16లక్షల44వేల715 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో పురుషులు 802575, మహిళలు 842054, ఇతరులు 86 మంది, సర్వీస్ ఓటర్లు 2115 (పురుషులు 2085, మహిళలు 30)ఉన్నారని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గంలో 2111 పోలింగ్ కేంద్రాలు, 88 సహాయక పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం 2199 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ సిబ్బంది 3891 మంది పీవోలకు ఏపీవో, ఓపిఓలు ఉన్నారని తెలిపారు. పోలీసు, ఇతరులు 1237 మొత్తం 5270 మంది ఉన్నారని తెలిపారు. మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించి పీవోలకు ఏపీవో, ఓపిఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం, వివి ప్యాట్లకు మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు.

రూ.32లక్షలకుపైగా నగదు సీజ్

ఇప్పటి వరకు జిల్లాలో 32,48,068 నగదు, రూ.7,94,770 విలువ చేసే 2308.4 లీటర్ల మద్యం, రూ.7,57,450 విలువ చేసే గంజాయి సీజ్ చేశామని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎంసీఎంసీ, ఇతర కమిటీలు పనిచేస్తున్నాయని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణలో పోలింగ్ నిబంధనలు, మాక్ పోల్ నిర్వహించే విధానం, పోలింగ్ రోజు నిర్వర్తించవలసిన విధులపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పిఓలు, ఎపిఓలు, ఓపిఓలు, పోలీస్ సిబ్బంది అందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించే వారిపై సంబంధిత చట్టాలను అనుసరిస్తూ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కోడ్ ఉల్లంఘన గురించి ప్రజలు నేరుగా 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, అలాగే సీ-విజిల్ యాప్‌ను కూడా ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచిందన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుండే ఓటేసే వెసులుబాటు

85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు ఇంటి నుండి ఓటు వేసే వెసులుబాటు ఉందని, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ఐదు రోజుల లోపు, అంటే ఏప్రిల్ 22 లోపు 12-డి ఫారం భర్తీ చేసి బీఎల్ఓలకు ఇవ్వాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు ముందస్తుగానే బీఎల్ఓల ద్వారా 12 - డీ ఫారాలు అందజేయబడతాయని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని వర్గాల వారు సహకారం అందించాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో అదనపు పోలీసు బలగాలతో పాటు ప్రత్యేక నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-నార్నూర్



గాదిగూడ మండలంలోని కునికాస గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులను మాజీ సర్పంచ్ కొడప జంగు ప్రారంభించారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులను పూర్తి చేయాలనీ గుతేదారులను ఆదేశించారు. ఆయన వెంట మాజీ ఉపసర్పంచ్ దత్తరాం, గ్రామ పటేల్ వెడ్మా దేవ్‌రావ్, గ్రామ యూత్ సభ్యులు కొడప గజానంద్, భీంరావ్, మేంగోరావ్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-నిర్మల్

మేడిపల్లి మాజీ ఉప సర్పంచ్, ప్రస్తుత ఆత్మ డైరెక్టర్ రాజుల నారాయణ, వార్డ్ సభ్యులు గణిమిల సయేందర్, పడిగెల గంగయ్య, బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. బుధవారం డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు సమక్షంలో నిర్మల్ మండల అధ్యక్షులు కుంట వేణుగోపాల్, మేడిపల్లి మాజీ సర్పంచ్ కుంట పద్మాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసేంత వరకు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పది సంవత్సరాల కాలంలో కుటుంబ పాలనలో విసిగిపోయిన బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో అందిస్తున్న పాలనకు ఆకర్షితులై పెద్ద ఎత్తున చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్యాణం.. కమనీయం

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- భక్తజన సంద్రంగా మారిన ఆలయాలు
- శాస్త్రోక్తంగా స్వామివారి కళ్యాణ మహోత్సవాలు



ఆదిలాబాద్‌టౌన్: రామునికి అక్షింతలు వేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఆదిలాబాద్‌టౌన్: రాములోరి కళ్యాణంలో పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జగదానందకారకుడు, ఆది పురుషుడు, రఘునందనుడు, మర్యాద పురుషోత్తముడు శ్రీరాముడి జన్మదినాన్ని పురస్కరించుకుని జరిపే శ్రీరామనవమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా కన్నుల పండువగా సాగాయి. బుధవారం శ్రీ రామనవమి పర్వదినం సందర్భంగా రామాలయాలు భక్తజనసంద్రంగా మారాయి. ఉదయం నుండే తరలివచ్చిన భక్తుల సమక్షంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు ఆలయ అర్చకులు నిర్వహించారు. సరిగ్గా ముహూర్తం సమయానికి శ్రీ సీతారాముల కళ్యాణ ఘట్టాన్ని అత్యంత వైభవోపేతంగా జరిపారు. శ్రీ సీతారాముల ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి భక్తులు కనులారా వీక్షిస్తుండగా కళ్యాణ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తకోటికి అమితానందాన్ని పంచారు. జై శ్రీరాం నినాదాలతో ఆలయాలు మారుమోగగా, సనాతన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా శ్రీరామ నవమి వేడుకలను ఉత్సాహవంతమైన వాతావరణంలో జరుపుకున్నారు.

ఆలయాల్లో మార్మోగిన శ్రీరామ నామస్మరణలు

ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని చాందా(టీ) గ్రామంలో గల రామాలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ ఘట్టాన్ని వీక్షించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేద పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ కళ్యాణ మహోత్సవాన్ని జరపగా సీతా రాముల కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా పూర్తి ఏర్పాట్లు చేశారు. అనంతరం రాములోరికి ప్రత్యేక హారతులు అందచేసి ఆరాధించారు. కళ్యాణం అనంతరం మహాన్నదానం ఏర్పాటు చేశారు. అటు న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని రామలయంలోనూ రామనవమి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో వచ్చిన భక్తుల సమక్షంలో శ్రీ సీతారాముల కళ్యాణ ఘట్టాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. అలాగే తిర్పెల్లిలోని పురాతన శ్రీ కోదండ రామాలయంలోనూ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు.

వేడుకల్లో ఎమ్మెల్యే, మాజీ మంత్రి

జిల్లా వ్యాప్తంగా రామనవమి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. రామలయాల్లో ఉదయం పూజలతో పాటు మధ్యాహ్నం సీతారాముల కళ్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని పలు ఆలయాల్లో జరిగిన కళ్యాణ మహోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయనతో పాటు నాయకులు గొర్ల రాము, అశోక్ రెడ్డి, ముకుందరావు, రాజేష్, భూమన్న, రాజన్న, వేద వ్యాస్, సతీష్, రాష్ట్ర పాల్, కార్యకర్తలు ఉన్నారు. అదే విధంగా జిల్లాకేంద్రంలోని రణదీవ్య నగర్, కొలిపుర, రాంనగర్, తో పాటు వివిధ ఆలయాల్లో జరిగిన కళ్యాణ వేడుకల్లో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని పూజలు చేశారు. నిర్వాహకులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇజ్జగిరి నారాయణ, మహేందర్, కౌన్సిలర్ కొండ గణేష్, పండ్ల శ్రీనివాస్ ఉన్నారు. ధర్మపాల్.భూమన్న.సతీష్.తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్ : రామ నవమిని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్ తదితర గ్రామాల్లో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామాలయంలో రాముల వారికి పట్టు వస్త్రాలు ధరించారు. భాజా భజంత్రీలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు గజానంద్ నాయక్, రాథోడ్ మధుకర్, ఉప సర్పంచ్లు విష్ణు, మహేందర్, ఉత్సవ కమిటీ సభ్యులు న్యానోబా పుష్కర్, కోటగిరి విశాల్, సత్య నారాయణ, చింతవార్ రాజు, చకోర్ శివాజీ, సురేష్ నాయక్, దినేష్ పటేల్, గోకులు పాల్గొన్నారు.

తాంసి : శ్రీరామనవమి పురస్కరించుకుని బుధవారం తాంసి, భీంపూర్ మండల కేంద్రాలలోని రామాలయాలతో పాటు మండలంలోని కరంజి, నిపాని, ధనోర, బండల్ నాగాపూర్, పొన్నరి, కప్పర్ల, హస్నాపూర్ గ్రామాలలోని ఆలయాల్లో సీతా రాముల కళ్యాణం మహోత్సవం వైభవంగా నిర్వహించగా కప్పర్లలో మాజీ టీపీసీసీ కార్యవర్గ సభ్యురాలు గంద్రత్ సుజాత దంపతులు తలంబ్రాలు పట్టువస్త్రాలు సమర్పించారు. వేద పండితులు కళ్యాణాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ గ్రామస్తుల సహకారంతో ఆలయాల్లో అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు క్రిష్ణ, వెంకన్న, నర్సింగ్, సదానందం, ఆలయ కమిటీ సభ్యులు సంతోష్, నారాయణ, మహేందర్, మధుకర్, రామన్న, ఆశారెడ్డీ, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

తలమడుగు : మండలంలోని కజ్జర్ల గ్రామంలో శ్రీ రామనవమి సందర్భంగా సీతరాముల మందిరంలో కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు. శ్రీరామ మందిరానికి గంతంలో నీటి సమస్య ఉండంతో బోర్ వేయించినమనీ, మందిరం అభివృదికి ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాబాన్న, ఎంపీటీసీలు కమలాకర్, వెంకన్న, రమేష్, చింతలపెల్లి దేవారెడ్డి, ఆనంద్ రావు, పోశెట్టి, శ్రీనివాస్, సంతోష్, లస్మన్న, చింతలపెల్లీ వెంకట్ రెడ్డి గ్రామస్థులతో పాటు వివిధ మండలాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కడెం : మండల కేంద్రంతో పాటు మండలంలోని అంబారిపేట్ వివిధ గ్రామాలలో శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నులకు వేడుకగా బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు సీతారాముల పల్లకిని భక్తిశ్రద్ధలతో భక్తి గీతాలు, డప్పు వాయిద్యాలతో గ్రామమంతా ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు.

ఉట్నూర్ : మండల కేంద్రంలోని రామాలయంలో రామనవమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి కృపాకాటక్షలతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, పూజారి సంతోష్, గోపి, భక్తులు పాల్గొన్నారు.

ఆలయానికి వచ్చే భక్తులకు నీరు పంపిణీ

శ్రీ రామ్ నవమి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లో తాగు నీరును సామాజిక కార్యకర్త మెస్రం కేశవ్ అందించారు. ఎండని దృష్టిలో పెట్టుకొని రోడ్డుకు ఇరువైపులా భక్తులు వచ్చే సమయానికి తాగు నీరును అందుబాటులో ఉంచానని తెలిపారు.

బోథ్ : సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాముని ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు సురేందర్ యాదవ్, సదానందం, గోపాల్, మల్లెపూల సుభాష్, నారాయణ రెడ్డి, బుచ్చన్న పాల్గొన్నారు.



తాంసి



తలమడుగు



కడెం



బోథ్



ఉట్నూర్



నార్నూర్

గిరి ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలకు కృషి



నవతెలంగాణ-బోథ్

గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు విద్య, వైద్యం సౌకర్యం కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మండలంలోని వజ్జర్, లేండిగూడ, మహాదుగూడ, కేశవ్‌గూడ, జైతు గూడలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీ ప్రతి గిరిజన పల్లెలో కేంద్రంలో అధికారంలోకి రాగానే ప్రతి సంవత్సరం 50 శాతం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి రైతులకు పోడు భూమి పట్టాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామన్నారు. అలాగే గిరిజన ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్‌తో సమానమైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సోనాలలో శ్రీరామనవమి సందర్భంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, అధికార ప్రతినిది చంటి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్, నాయకులు పోతారెడ్డి, గాజుల పోతన్న, విజయ్ బత్తుల రమేష్, భాస్కర్, అనిల్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతం కోసం పని చేయాలి



నవతెలంగాణ-నేరడిగొండ

పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో నాయకులు పని చేయాలని బీజేపీ నాయకులు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో బుధవారం బీజేపీ కార్యదర్శుల నియమకం జరిగింది. మండల ప్రధాన కార్యదర్శులుగా నాగమల్యాల గ్రామానికి చెందిన బంటు ప్రవీణ్, కుప్టీ గ్రామానికి చెందిన ఆకుల రాజశేఖర్, వడూర్ గ్రామానికి చెందిన ధర్మపురి రాఘవులు, కార్యదర్శిగా నేరడిగొండ గ్రామానికి చెందిన బొంతుకుల శ్రీను, దళిత మోర్చ అధ్యక్షునిగా గుత్పాల గ్రామానికి చెందిన లింగంపల్లి సురేష్, ఓబీసీ మోర్చ మండల అధ్యక్షునిగా వడూర్ గ్రామానికి చెందిన రాంగుడ్ల సురేష్‌లను నియమించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ పార్టీ కార్యాలయంలో నియమక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత కల్పించామని, ప్రధాన పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించామని పేర్కొన్నారు.

మహంకాళి జాతర పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని వాయిపెట్ గ్రామంలో ఈ నెల 22 నుండి జరగబోయే మహంకాళి జాతర ఉత్సవాల పోస్టర్లను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ విడుదల చేశారు. బుధవారం ఉత్సవ సమితి నాయకులు ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి విడుదల చేయించారు. జాతర సందర్భంగా వాలీబాల్, కబడ్డీ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జాతర నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒమేశ్వర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సేవాలాల్ దీక్ష విరమణ

నవతెలంగాణ-నార్నూర్

లంబాడిల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ దీక్షను బుధవారంతో భక్తులు విరమించారు. వారం రోజుల నుండి లంబాడి భక్తులు పాదయాత్రగా వెళ్ళి రామనవమి రోజు మహారాష్ట్రలోని కాశీ పొరాదేవిని దర్శించుకున్నారు. 41, 21, 11 రోజులుగా దీక్షలు చేపట్టి రామనవమి సందర్భంగా బంజారా కాశి పొరాదేవిలో భక్తులు జగదంబా దేవీ, సేవాలాల్ మహారాజ్, రామారావ్ మహారాజ్‌ను దర్శించుకున్నారు. అదేవిధంగా జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ దీక్ష చేపట్టి 11 రోజులుగా ఉపవాసముండి దీక్షను విరమణ చేశారు. అనంతరం రామారావు మహారాజ్ మనవడు శేఖర్ మహారాజ్ దీక్ష గురు ప్రేమ్ సింగ్ మహారాజ్ ఆశీస్సులు పొందారు. ముందుగా తండాలో జగదాంబ దేవి సేవాలాల్ మహారాజ్ ఆలయాల వద్ద జెండాను ఆవిష్కరించి భక్తులు భోగ్ బండార్ పూజలు నిర్వహించారు.

శబరిమాత ఆశ్రమాన్ని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేరడిగొండ



మండల కేంద్రంలోని శ్రీ శబరిమాత ఆశ్రమంలో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో ముఖ్య అతిథిగా బోథ్ శాసన సభ్యులు అనిల్ జాధవ్ పాల్గొన్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఆయనకు స్వాగతం పలికి పూజలు చేయించారు. అనంతరం శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మెన్ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పెంట వెంకట రమణ, ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, లచ్చన్న కార్యకర్తలున్నారు.

పట్టణంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శ్రీరామ నవమి వేడుకలు, పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక వినాయక్ చౌక్ నుండి పట్టణంలోని ప్రధాన వీధులగుండా ఈ ర్యాలీ కొనసాగింది. జిల్లా ఎస్పీ గౌస్ ఆలం నేతృత్వంలో డీఎస్పీలు జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్ ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే సీఆర్పీఎఫ్ సిబ్బంది, జిల్లా పోలీసులు సంయుక్తంగా ఈ ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ఆ భవ్య రాముని నవమి వేడుకలతో పాటు పట్టణంలో సాయంత్రం శోభాయాత్ర నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాలకు అనుగుణంగా అందుకు సంబంధించి శాఖ తరపున పూర్తి ఏర్పాట్లు చేశారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో సీఐలు సత్యనారాయణ, అశోక్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అదేవిధంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా, ఎటువంటి భయబ్రాంతులు లేకుండా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునే విధంగా ధైర్యంగా ఉండేలా ఈ ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఎల్లవేళలా పోలీసులు ప్రజలకు అండగా ఉంటారనే సందేశమిస్తూ ఈ ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది.

ఘనంగా సీఆర్ఆర్ జయంతి వేడుకలు


నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు దివంగత మాజీ మంత్రివర్యులు చిలుకూరి రామచంద్రారెడ్డి జయంతోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా సీఆర్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఆయన అందించిన సేవలను మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ రావు పాటిల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి కొనియాడారు. ఆదిలాబాద్ అంటే రాంచంద్రారెడి అనేంతలా ఇక్కడ పేరు తెచ్చుకున్నారన్నారు. అలాంటి వ్యక్తి మన ఆదిలాబాద్ వాసి కావడం అదృష్టమన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిలుకూరి రామచంద్ర రెడ్డి జయంతిని బుధవారం శాంతినగర్‌లోని ఆయన నివాసంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో చిలుకూరి రామచంద్ర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో కూడా కీలకపాత్ర పోషించిన మహనీయుడు చిలుకూరి రామచంద్ర రెడ్డి అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రిగా, పలుమార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, కౌన్సిలర్ అంబకంటి అశోక్, మావల మండల కాంగ్రెస్ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, గోవర్ధన్ రెడ్డి, దామోదర్ రెడ్డి, కుంబోజి రాములు, ప్రభాకర్,వెంకటేష్, నాగరాజు, సీఆర్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ టౌన్: ప్రజాసేవ భవన్‌లో సీఆర్ఆర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు



ఆదిలాబాద్ రూరల్: సీఆర్ఆర్ నివాసంలో నివాళులర్పిస్తున కుటుంబ సభ్యులు, నాయకులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | ఏప్రిల్ 18, 2024 | www.navatelangana.com

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహారాష్ట్రలోని చంద్రపూర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మహారాష్ట్ర రాష్ట్ర అటవీశాఖ మంత్రి సుధీర్ మునిగంటివార్‌కు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రపూర్‌లోని మహంకాళి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ప్రతి దుకాణాల్లో ప్రచారం నిర్వహించి కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పదేండ్ల కాలంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తు ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, తెలంగాణ రాష్ట్ర సీనియర్ నాయకులు బోనగిరి సతీష్ బాబు, జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్, జిల్లా కార్యదర్శి కుందారపు బాలకృష్ణ, జిల్లా నాయకులు ఎలమంచిలి సునీల్ చౌదరి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇగురపు సంజీవ్, రెబ్బెన మండల ప్రధాన కార్యదర్శి ఓదెలు, ఆసిఫాబాద్ మండల నాయకులు సూర్య ప్రకాష్, జయరాజ్, నాయకులు సోమ శ్రీనివాస్, మున్న, రవి పాల్గొన్నారు.

రేపు ఆదివాసుల చర్చా

నవతెలంగాణ-బెజ్జూరు

మండల కేంద్రంలోని కుమురం భీం భవనంలో ఈ నెల 19న ఆదివాసులు సమస్యలపై చర్చా వేదికను ఏర్పాటు చేయనున్నట్లు ఆదివాసీ సంఘాల జిల్లా నాయకుడు సోయం చిన్నయ్య, మండల నాయకులు మెస్రం రాజారాం, ఎలాది నారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చర్చలకు ముఖ్య అతిథులుగా గోండ్వానా గోండు మహాసభ జాతీయ నాయకుడు సిడం అర్జు మాస్టర్, గోండ్వానా రాయ్ సెంటర్ చర్చా గోష్టి జిల్లా నాయకుడు మోతిరాం హాజరుకానున్నట్లు తెలిపారు. స్వతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అవుతున్న తమ సమస్యలు గుర్తించి పరిష్కరించడలేదన్నారు. పాలకులు మారుతున్న తమ బతులు మాత్రం మారడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. ఐక్యతతో పాటు ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం మండలంలోని నార్ పటేల్, సార్ పటేల్, ఘాటియల్, దేవారి నాయకులతో పాటు ఆదివాసీ గ్రామపెద్దలు తదితర వర్గాల వారు ఈ చర్చల్లో పాల్గొని చర్చను విజయవంతం చేయాలని కోరారు.

బూర్గుడలో గాలివాన బీభత్సం





నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని బూరుగుడా గ్రామంలో బుధవారం సాయంత్రం ఒకేసారి ఈదురుగాలులు వీచడంతో పాటు కురిసిన వానకు ఇంటి పైకప్పులు, విద్యుత్ స్తంభాలు, చెట్లు విరగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గ్రామంలోని గాజుల పెంటయ్య, చిగురు గోపాల్, పుధరి పెంటక్క, బుజాడి బొడ్డు, దర్ని రమేష్, ఎరుపోతు వినోద్, పులగం శంకర్, దాడి రగులయ్యల ఇంటి పైకప్పులు గాలికి లేచిపోవడంతో ఇంట్లోని నిత్యావసర వస్తువులు తడిసిపోయాయి. అలాగే పూదరి చెంద్రయ్య అనే రైతు ఎద్దుకు గాలికి లేచిపోయిన రేకులు తగలడంతో ఎద్దు కాలు విరిగింది. పూధరి పెంటక్క అనే వృద్ధురాలి ఇంటి పైన వున్న రాయి పడి గాయాలు కాగా లోకొండే చిన్నక్కపై చేట్టు పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. రహదారి ప్రక్కనే నిలిపిన లారీ ఒకేసారి గాలి రావడంతో కింద మట్టి కుంగిపోయి బోల్తా పడింది. ఆ సమయానికి ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రహదారి ప్రక్కన ఉన్న దాబా హోటల్ రేకులు లేచిపోయి పొలాల్లో పడ్డాయి. గ్రామంలోని విద్యుత్ స్తంభాలు విరగడంతో సరఫరా నిలిచిపోయింది. గ్రామంలోని రహదారికి ఇరువైపులా చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. దీంతో గ్రామ ప్రజలు ఒకేసారి భయాందోళనకు గురయ్యారు. దాదాపు అరగంట పాటు వీచిన ఈదురు గాలులతో గ్రామం అట్టుడికిపోయింది.

వేసవిలో నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవికాలం పూర్తయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాలకు సైతం నిరంతర తాగునీటి సరఫరాకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. దినపత్రికలలో వచ్చిన వార్త కథనాలపై తక్షణమే స్పందిస్తూ పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని జైనూర్ మండలం డబోలి గ్రామపంచాయతీలో 399 ఆవాసాలు, 1,695 మంది జనాభా ఉండగా, గ్రామపంచాయతీ పరిధిలోని వడ్డెరగూడ గ్రామంలో 35 ఆవాసాలు, 140 మంది జనాభా ఉన్నారన్నారు. డబోలి గ్రామపంచాయతీలో ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు 10 చేతిపంపులు, 2 మోటార్‌తో కూడిన బహిరంగ బావులు, 2 మోటారు లేని బహిరంగ బావులు, మిషన్ భగీరథ పథకంలో 40 కెఎల్‌ఓహెచ్ ఎస్ఆర్, 1, 20 కెఎల్ 3, 10 కెఎల్ 1, 5 కెఎల్ జీఎల్ఆర్ 2 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వడ్డెరగూడతో పాటు షేకుగూడ, జాదుగూడ గ్రామాలలో గ్రామీణ నీటి సరఫరా, మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ ఈఈ, డిఈఈ, ఏఈఈలు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరుగుతూ తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయంతో పని చేస్తున్నారని వివరించారు. తాగునీటి సమస్యల పరిష్కారం దిశగా అధికారుల సమన్వయంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

బీజేపీలో చేరిన అరిగెల బ్రదర్స్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్‌తో సహా పలువురు నాయకులు మంగళవారం రాత్రి రాష్ట్ర రాజధానిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, నాయకులు బండి సంజయ్, పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ల ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. కొంతకాలంగా బీఆర్ఎస్‌లోని ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి వర్గీయులతో వీరికి పొసగడం లేదు. అలాగే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప రాజీనామా తర్వాత ఆ పదవీ నాగేశ్వరరావు ఆశించినప్పటికీ జిల్లా నాయకులు ఆయనకు ఇవ్వకూడదని అదిష్టానం వద్ద చెప్పడంతో బీజేపీలో చేరినట్లు తెలుస్తోంది. ఇదే విషయం అడగక ఎన్నో సంవత్సరాల నుండి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశానని తనకు సరైన గుర్తింపు లేకపోవడం బాధ కలిగించిందన్నారు. అరిగేల బ్రదర్స్ బీజేపీలో చేరడంతో ఆయనతో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు ఆ పార్టీలో చేరారు. దీనితో మండలంలో బీఆర్ఎస్‌కు కొంతమంది మాత్రమే నాయకులు మిగిలారు. బీజేపీలో చేరిన వారిలో అప్పపెల్లి మాజీ సర్పంచ్ బాబురావు, సింగరావుపేట మాజీ సర్పంచ్ మహేష్, నాయకులు అరిగెల అనురాగ్, అరిగెల శరత్ కుమార్, బందారపు మధుకర్, పెద్దపల్లి శ్రీనివాస్, మున్న గడ్డల సురేష్, వాంకిడి నాయకులున్నారు.

ఆరోగ్యాన్ని హరిస్తున్న ప్లాస్టిక్

- పాలీథిన్ కవర్లతో అనర్థం
- నిషేధమున్నా అమలుచేయని అధికారులు
- విచ్చలవిడిగా వినియోగం

నవతెలంగాణ-దహెగాం



చేతిసంచి కనుమరుగైంది. ప్లాస్టిక్ కవర్ల వాడకంతో పర్యావరణం దెబ్బతింటుందని తెలిసినా వాటి వినియోగాన్ని ఆపలేకపోతున్నారు. నిత్యావసర సరుకులతో పాటు కూరగాయలు, పండ్లు, కిరాణ సామాగ్రిని వ్యాపారులు కవర్లలోనే ఇస్తున్నారు. వినియోగదారులు సైతం చేతిసంచి తీసుకెళ్లడం లేదు. పాలిథిన్ కవర్ల వల్ల లాభాల కన్న నష్టాలే ఎక్కువ అనే విషయాన్ని మర్చిపోతున్నాం. పర్యావరణ సమతుల్యం లోపించి వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. ఒక ప్లాస్టిక్ మట్టిలో కలవడానికి దాదాపు 10 సంవత్సరాలు పడుతుందని శాస్త్రవేత్తలు చెపుతున్నారు. అయినా ఎవరు పట్టించుకోవడంలేదు. టీ తాగాలన్నా డిస్పోజల్ గ్లాసులు, టిఫిన్ చేయాలన్నా, భోజనం చేయాలన్నా ప్లాస్టిక్ ప్లేట్లను వినియోగిస్తున్నారు. విందులు, శుభకార్యాల్లో అతిథులకు మంచినీళ్ల ఇవ్వడం దగ్గర నుండి భోజనాలు వడ్డించే వరకు ప్లాస్టిక్ అధికంగా వాడుతున్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్, మెదడువాపు, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, సంతానోత్పత్తికి హానికల్గడం, పిల్లల్లో బుద్ధిమాంద్యం వంటి పలు ప్రాణాప్రాయ రోగాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్లాస్టిక్ పాలిథిన్ కవర్ల అమ్మకాలపై నిషేధం ఉన్నా వాటి ఉత్పత్తునలు నిలిపివేయకపోవడం వల్ల అనర్ధాలు పెరిగిపోతున్నాయి. ప్లాస్టిక్ వాడకంపై నిషేధాన్ని అమలు చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తే ప్రమాదాల బారి నుండి కాపాడుకోనే అవకాశాలుంటాయి.

అమలుకు నోచుకోని ఉత్తర్వులు...

పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం ప్లాస్టిక్ వ్యర్థాల నిబంధనలు 2011 ఆధారంగా 40 మైక్రాన్ల కన్న తక్కుత మందం కల్గిన ప్లాస్టిక్ ఉత్పత్తులైన పాలిథిన్ కవర్లు, టీ కప్పులు, ప్లేట్లు, గ్లాసులు, ప్లాస్టిక్ సీసాలు, ఇతర ప్రచార సామగ్రి, తోరణాలు, ఫ్లెక్సీలపై నిషేధం విధించారు. 2013లో జారీ చేసిన జీఓ నెంబర్ 46 ఉత్తర్వుల ప్రకారం 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం కల్గిన ప్లాస్టిక్ వస్తువులను ఉత్పత్తి చేయడం, నిల్వ, పంపిణీ చేయడం, విక్రయించడం నిషేధం. ఒక వేళ ఎవరైన వ్యాపారులు ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయిస్తే రూ.2500 నుండి రూ.5000 వేల వరకు జరిమానా విధించాలి. అలాగే తయారీ దారులకు రూ.25 వేల నుండి రూ.50 వేల వరకు జరిమానా వేయాలి. కానీ సంబంధిత అధికారులు నామమాత్రంగా దాడులు నిర్వహించి సమాచారాన్ని వారు ముందే వ్యాపారస్తులకు చెపుతుండడంతో అప్రమత్తం అవుతున్నారు.

ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు...

నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, గ్లాసులు వంటిని నీటిని, మట్టిని, గాలిని కలుషితం చేస్తాయి. వర్షపు నీరు భూమిలో ఇంకకుండా అడ్డుకుంటాయి. వీటి తయారీలో వినియోగించే జెంజిన్, వినైల్‌క్లోరైట్ వంటి రసాయనిక ఉత్పత్తులతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులొస్తాయి. క్యారీ బ్యాగులో ఆహార పదార్థాల వినియోగంలో గర్భంలోని శిశువుల ఆరోగ్యానికి సైతం హాని కలిగిస్తుంది. పశు గ్రాసంతో పాటు పశువులు ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్నాయి. చెరువులు, నదుల్లో ఈ వ్యర్థాలను వేయడం వల్ల వాటిని తినే చేపలు మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ సంచులు ఉత్పత్తులు వినియోగించి పడేసిన తర్వాత దహనం చేయడం వల్ల చెలరేగే మంటలు పొగతో విష వాయువులు వెలువడుతాయి.

ఇవి చేయకూడదు...

మంచినీరు, ఆహార ఉత్పత్తులు వేడి ద్రవ పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ క్యారీ బ్యాగుల్లో ఉంచొద్దు. రీసైక్లిన్ ఉత్పత్తులు బ్యాగులు, తేలిగ్గా కరిగే గుణం కల్గిన సంచులు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వినియోగించొద్దు. రంగులతో కూడిన ప్లాస్టిక్ ఉత్పత్తుల సంచుల్లో ఆహార పదార్థాలు నిల్వ ఉంచడం, నిల్వ చేయడం పూర్తిగా నిషేధం. గృహాలు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, పండ్ల రసాల దుకాణాల్లో వీటిని వినియోగించొద్దు.

కౌటగూడలో అగ్నిప్రమాదం

- రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని కౌటగూడా గ్రామంలో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో రూ.నాలుగు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తుంది. స్థానిక మాజీ సర్పంచ్ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని గెడెం లక్ష్మణ్ ఇంట్లో రోజు మాదిరిగానే పూజ చేసి దీపం పెట్టి శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొనడానికి వెళ్లారు. తర్వాత దీపంతో ఇంట్లో వస్తువులకు అంటుకొని ఇల్లు కాలినట్లు తెలుస్తుంది. ముందు రేకుల ఇల్లు, వెనకాల స్లాబ్ ఇల్లు ఉండగా రేకుల ఇల్లు పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు. ఇంట్లో మూడు సిలిండర్లు వేరువేరు చోట్ల ఉండగా ఒక సిలిండర్ తేలిపోయి రేకులు, వస్తువులు చెల్లాచెదరైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇంట్లో ఉన్న కూలర్ బీరువాతో బంగారం నగదు వెండి వస్తువులు అగ్నికి ఆహుతి అయినట్లు తెలిపారు. రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే మాజీ సర్పంచ్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఆస్తి నష్టాన్ని అంచనా వేయాల్సిన రెవెన్యూ సిబ్బంది సాయంత్రం వరకు కూడా సంఘటన స్థలానికి రాలేదని తెలిపారు. తనను ఆదుకోవాలని బాధితుడు కోరారు.



కన్నుల పండుగగా సీతారాముల కల్యాణ వేడుకలు

- ఆద్యంతం అలరించిన శోభాయాత్ర
- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే
- పోలీసుల పటిష్ట బందోబస్తు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్‌లో రామునికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, కుటుంబ సభ్యులు

శ్రీరామనవమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో రాములోరి కళ్యాణాలను కమనీయంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రామాలయంలో సీతారాముల కళ్యాణం కనుల పండుగగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేయగా ఉదయం నుండి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణ మహోత్సవ పూజారి నిమ్మకంటి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో శ్రీరాముని కళ్యాణ వేడుకలు అంబరాన్నంటేలా సాగాయి. వేద పండితులు శిరీష్ శర్మ, మహేష్ శర్మ, అనంత శర్మ వినాయక శర్మతో పాటు 12 మంది వేదపండితులు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, కమిటీ సభ్యులు సిరిపురం భద్రయ్య, శైలేందర్, పర్రె గిరి, చందు, సిహెచ్.రవి, ఇప్ప నాగరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన శోభాయాత్ర

శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా ఉత్సవ విగ్రహాలతో జిల్లా కేంద్రంలో చేపట్టిన శోభాయాత్ర అద్యంతం అలరించింది. భాజా భజంత్రీల మధ్య డీజే సౌండ్‌తో దాదాపు 400 మందితో శోభాయాత్ర సాగింది. దారిపొడున జై శ్రీరాం నినాదాలు చేశారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

వేడుకల్లో భాగంగా శ్రీరాముని కళ్యాణానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, సోనేరావు దంపతులు తన కుమారుడు సాయితో కలిసి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా పట్టు వస్త్రాలు సమర్పిస్తున్నట్లు వివరించారు.

పాల్గొన్న ప్రముఖులు

రామాలయం ఆవరణలో నిర్వహించిన శ్రీరాముని కళ్యాణ వేడుకలకు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దాసరి వేణు, న్యాయమూర్తి అనంతలక్ష్మి, డీఎస్పీ సదయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, మల్లేష్ పాల్గొన్నారు.

పోలీసుల పటిష్ట బందోబస్తు

శ్రీరామనవమి వేడుకలలో భాగంగా ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా డీఎస్పీ సదయ్య నేతృత్వంలో పట్టణ సీఐ సతీష్, డీసీఆర్బీ సీఐ రాణప్రతాప్, ఎస్సై ప్రవీణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

కళ్యాణ వేడుకల్లో సేవా కార్యక్రమాలు

జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రామాలయంలో నిర్వహించిన శ్రీరాముని కళ్యాణ వేడుకల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదానానికి దాతగా నిమ్మకంటి సంతోష్ శర్మ వ్యవహరించారు. దాదాపు 5000 మంది భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

పద్మశాలి సంఘ ఆధ్వర్యంలో

పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు, అనుమాండ్ల శ్రీకాంత్, జంజిరాల శ్రీనివాస్, బొద్దున చందు, జంజిరాల సంజీవ్, పొన్న రాంచందర్, చెన్నూరి ప్రకాష్, ఆవిడపు ప్రణయ్, బోగ మధూకర్, పసుపునూరి నవీన్, వనమాల దర్మయ్య, పొన్న తిరుపతి, కోమటిపెల్లి యేసయ్య అనుమాండ్ల సంతోష్, అనుమాండ్ల ప్రవీణ్, ఇరుకుల్ల ప్రసాద్, అనుమాండ్ల క్రాంతి, చెన్నూరి సునీత, అనుమాండ్ల సుజాత, ఇరుకుల్ల పుష్పలత, వనమాల జయ, జంజిరాల శ్రావణి అనుమాండ్ల లహరి పాల్గొన్నారు.

వాసవి పాఠశాల ఆధ్వర్యంలో

వాసవి పాఠశాల ఆధ్వర్యంలో భక్తులకు, తాగునీరుతో పాటు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రాజ్ కుమార్, అజయ్ పలువురు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంతో పాటు బాబాసాగర్, డబ్బా, కార్జెల్లి దింద, గూడెం పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా భక్తులు నిర్వహించారు. అంతకు ముందు సీతారాముల విగ్రహాలను పాలాభిషేకం నిర్వహించి అలంకరించారు. హనుమాన్ మాలదారులు, భక్తులు పాల్గొని పాలపోరక పందిళ్లలో మామిడాకు, అరిటాకులతో అలంకరించి సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించారు.

కెరమెరి : శ్రీరామ నవమి వేడుకలను బుధవారం మండలంలో వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని శివాలయంతో పాటు రామాలయంలో మంత్రోచ్చరణల మధ్య కన్నులపండువగా రాములోరి కల్యాణం జరిపారు. ఒక్కరోజు ముందుగానే ఆలయాలను విద్యుత్‌కాంతులతో ముస్తాబు చేసి సీతారాముల కల్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శ్రీరామచంద్రున్ని ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయాలకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో భాజాభజంత్రీలు, వేదమంత్రాలు, ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణాన్ని ఎంతో కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు సీతారాముల వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

వాంకిడి : మండల కేంద్రంలోని బంబారా గ్రామంలోని రామాలయంలో శ్రీ రామనవమిని పురస్కరించుకొని సీతారాముల కళ్యాణోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి జెడ్పీటీసీ అజయ్‌కుమార్ కుటుంబ సమేతంగా పాల్గొని రాముల వారికి పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు సమర్పించి పూజలు చేశారు. స్వామివారి కృపకటాక్షాలతో ప్రజలందరు సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే వివిధ గ్రామాల నుండి ప్రజలు పాల్గొని తమ మొక్కులను చెల్లించుకున్నారు.

సిర్పూర్(టి) : శ్రీరామనవమిని పురస్కరించుకొని మండలకేంద్రంతో పాటు మండలంలోని చీలపెల్లి, హుడ్కిళి, భూపాలపట్నం గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కళ్యాణోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ కళ్యాణ మండపం, రైల్వేస్టేషన్‌లోని రామాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని కోదండ రామాలయం, మండలంలోని చెడ్వాయి గ్రామంలోని చీకటయ్య ఆలయ ప్రాంగణంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణాన్ని బుధవారం కన్నుల పండుగగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆలయంలో రాచర్ల కృష్ణ-శరణ్య కుంకుముత్తి రాకేష్-జ్యోతి దంపతులచే సీతారాముల కళ్యాణ్యాన్ని నిర్వహించారు. అనంతరం కోదండ రామాలయం నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. సీతారాముల కళ్యాణాన్ని వీక్షించడానికి భక్తులు ఆలయాల్లో పోటెత్తారు.

కౌటాల : సీతారాముల కళ్యాణ మహోత్సవం బుధవారం మండల కేంద్రంలోని రామాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు హనుమాన్ మలాధారణ వేసిన భక్తులు జై శ్రీరామ్ నామ స్మరణతో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో హోమం, గణపతి పూజ, ఆరాధన కార్యక్రమాలను ఆలయ అర్చకుడు విఘ్నేష్ ఆచారి నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని తుమ్మిహేటి ప్రాణహిత నదీ తీరాన గల కార్తీక్ మహారాజ్ ఆలయంలోని సీతారాముల ఆలయంలో కళ్యాణ మహోత్సవాన్ని భక్తి ప్రపత్తుల నడుమ నిర్వహించారు. రాముల వారి కళ్యాణానికి మండలంలోని ఆయా గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సీతారాముల దర్శనానికి క్యూలైన్‌లో గంటల తరబడి వేచి ఉన్నారు. కళ్యాణం అనంతరం భక్తులందరికి తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, ఆలయ ధర్మకర్త వాసాల రామస్వామి, ఆలయ కమిటీ అధ్యక్షుడు గట్టయ్య, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బెజ్జూరు : మండలంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో మండలవాసులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఎలుకపెల్లి, బెజ్జూరు, సిద్ధాపూర్, పాపన్‌పేట్, బారెగూడ, సలుగుపెల్లి, మర్తిడి తదిరత గ్రామాల్లో సీతారాముల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం రాముల వారి విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించినంతరం మధ్యాహ్నం 12:05 నిమిషాలకు వివాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వివాహ కార్యక్రమానికి మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బెజ్జూరు రంగనాయక ఆలయంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ విక్రమ్, నాయకులు శ్రీవర్ధన్, శంకర్, జావీద్, డోకె వెంకన్న, సకారాం, సతీష్ పాల్గొన్నారు.

రెబ్బెన : బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కళ్యాణ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు సంతోష్ శర్మ బృందం వేద మంత్రోచ్చరణల మధ్య కళ్యాణ మహోత్సవం జరిగింది. గోలేటి పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ జలేందర్ దంపతులు భాజాభజంత్రీల మధ్య తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. కళ్యాణానికి ఖైరిగూడ ప్రాజెక్టు ఆఫీసర్ సత్యనారాయణ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్మిక కుటుంబాలతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు, హనుమాన్ మాలధారణ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆరెంజ్ జూస్ రస్నా, బెల్లంపాకం, పప్పు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శేషశయనరావు, ప్రకాష్‌రావు, ఏఐటీయూసీ గోలేటి కార్యదర్శి ఎస్ తిరుపతి, కమిటీ సభ్యులు ఉయిక చంద్రశేఖర్, సొల్లు లక్ష్మీ, లేకూరి సుధాకర్, జిల్లెల సత్యనారాయణ, పరికిపండ్ల సతీష్, పంబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దహెగాం : మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆలయాల్లో సీతారాముల కళ్యాణం వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం సీతారాముల విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. సీతారాముల కళ్యాణ మహోత్సవానికి మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.













నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | ఏప్రిల్ 18, 2024 | www.navatelangana.com

క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు వేల్పుల శ్రీనివాస్ టీషర్టులు పంపిణీ చేశారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి నర్సింగాపూర్‌లో యువ క్రీడాకారులను కలిశారు. క్రికెట్ క్రీడ పట్ల ఆసక్తి పెంచుకుంటున్న 15 మంది క్రీడాకారులను గుర్తించి వారికి తన వంతుగా స్వంత ఖర్చులతో టీషర్ట్స్ అందజేసినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని కోమటిచేను గ్రామంలో బెడ్డెల మోనిక(28) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. బుధవారం ఉదయం మోనిక తన ఇంటిపై ఉన్న వాటర్ ట్యాంక్‌లో నీటిని చూడడానికి ఇంటి ఇనుప రేకులపైకి ఎక్కింది. ఇంట్లోని విద్యుత్ వైర్లు తెగి రేకులకు, పైపులకు విద్యుత్ సరఫరా కావడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్కు గురై మృతి చెందింది. మృతిరాలికి భర్త రాజేశ్, ఒక కుమారుడున్నారు. ఈ మేరకు తండ్రి జాడి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

నవతెలంగాణ-మందమర్రి

శ్రీరామ నవమిని పురస్కరించుకొని బుధవారం పాలచెట్టు ప్రాంతంలోని శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయం మిథిల ప్రాంగణంలో సీతా రాముల కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు మంగళ వాయిద్యాలు శ్రీరామ నామస్మరణతో అభిజిత్ లగ్నాన లోకాభిరాముడి కల్యాణం వేద పండితులు, అతిథిలు, అశేష జనవాహిని, హనుమాన్ భక్తుల మధ్యన అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా కలెక్టర్ బదావత్ సంతోష్ పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించారు. చెన్నూరు శాసనసభ్యులు వివేక్ వెంకటస్వామి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. కల్యాణం అనంతరం ఆలయ ధర్మ కర్తలు, కమిటీ సభ్యులు భక్తులకి అన్నదానం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్త్ ఏర్పాటు చేశారు.


మందమర్రి : సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్

రామకృష్ణాపూర్ : శ్రీరామనవమి సందర్భంగా బుధవారం పట్టణ పరిధిలోని రామాలయం, అమరవాది గ్రామంలోని అభయాంజనేయ దేవాలయాల్లో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దంపతులు దర్శించుకున్నారు. దేవాలయాల్లో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే మందమర్రి ఏరియా జీఎం మనోహర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిదంగా పట్టణంలో స్థానిక రామాలయంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


జైపూర్ : సీతారాములకు మట్టెలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

నస్పూర్ : మున్సిపల్ పరిధిలో బుధవారం సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ఆంజనేయస్వామి ఆలయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అలాగే శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి దంపతులు శ్రీవెంకటేశ్వర ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారామచంద్రస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు.

జన్నారం : మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని గోదావరి నది ఒడ్డున వెలసిన శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి, రామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అలాగే మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని రామాలయంలో, రేండ్లగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో, వేరువేరుగా సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. పొన్కల్ రామాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు, తిమ్మాపూర్ రామాలయంలో బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ ఆలయ కమిటీ సభ్యులు కమ్మల భూమయ్య, గంగయ్య, కమ్మల విజయధర్మ, మాజీ సర్పంచ్ జాడిగంగాధర్, ఎంపీటీసీ దర్శనాల వెంకటస్వామి పాల్గొన్నారు.


జైపూర్ : తలంబ్రాలతో ఊరేగింపుగా వస్తున్న సింగేణి డైరెక్టర్ దంపతులు

జైపూర్ : శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఉమ్మడి మండలంలో బుధవారం సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. భీమారం మండల కేంద్రంలో గల కోదండ రామాలయంలో ఉదయం 11:51 గంటలకు ఆలయ కమిటి అధ్యక్షుడు చేకుర్తి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆశ్లేష నక్షత్రయుక్త అభిజిత్ లగ్న సుముహూర్తమున సీతారాములకు కల్యాణం పురోహితులు విశ్వేశ్వర శర్మ, ప్రధాన పూజారి తిరునగరి కన్నయ్య, ప్రవీణ్ కుమార్‌లు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిదంగా జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలు మొట్టమొదటి సారిగా జరుపుకున్నారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వేధిక మీదుగా సీతారాముల కల్యాణానికి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దంపతులు పుస్తె మెట్టెలు సమర్పించారు. అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో కల్యాణం వైభవంగా నిర్వహించారు. జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆవరణలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణ రావు పాల్గొని సీతారాముల కల్యాణం నిర్వహించారు. ప్లాంట్ ఈడీ బసివి రెడ్డి, ఇతర అధికారులతో కలిసి సీతారాములకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలతో శోభాయాత్ర నిర్వహించారు.

దండేపల్లి : శ్రీరామ నవమి పురష్కరించుకొని బుధవారం దండేపల్లి మండలంలొని ఆయ గ్రామాల ఆంజనేయ, రామాలయాల్లో ఆదివారం సీత రాముల కల్యాణం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చరణలతో సీతారాముల కల్యాణం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీలో సీతారాముల విగ్రహ మూర్తులను ఉరేగింపు నిర్వహించారు. పల్లకీ సేవలో భాజా భజంత్రీల మధ్య భక్తులు నత్యాలు చేస్తూ ఊరేగించారు. గూడెం శ్రీ రమ సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో బద్రాద్రి రాముని కళ్యాణానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదాన కర్యక్రమం నిర్వహించారు.

కాసిపేట : మండలంలో బుధవారం ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాములోరి కల్యాణ మహోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చి వివాహ వేడుకలను తిలికించారు. ధర్మరావుపేట గ్రామంలోని కోదండ రామాలయంలో కల్యాణం ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పూజలో పాల్గొన్నారు. దేవాపూర్‌లో ఎమ్మెల్యే వినోద్ దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించి అప్పగింతలు కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం బజన కార్యక్రమాలతో పాటు సంస్కృతిక కార్యకమాలు నిర్వహించారు.


నస్పూర్‌లో..


కాసిపేటలో..


దండేపల్లిలో..

గ్రీన్ ఫీల్డ్ హైవే సర్వేలో విమానాలు, హెలీకాప్టర్లు



నవతెలంగాణ-జైపూర్

నాగాపూర్-విజయవాడ మధ్య నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే సర్వే కోసం ప్రత్యేకంగా విమానాలు, హెలీకాప్టర్లు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. గత వారం రోజులు నుంచి రెండు హెలీకాప్టర్లు, చిన్న సైజులో ఉన్న విమానం కుందారం-కిష్టాపూర్ సరిహద్దుల మీదుగా గగన తలంలో చక్కర్లు కొడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. భీమారం మండలంలో కూడా గాలిమోటర్లు తిరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం భీమారం మీదుగా హైదరాబాద్ వైపు ప్రయాణిస్తున్న హెలీకాప్టర్‌ను గుర్తించినట్లు తెలిపారు. వారం రోజుల నుంచి ఉమ్మడి మండలంలో గాలిమోటర్ల రాకపోకల సందడి కన్పిస్తోందని పేర్కొంటున్నారు. భూమికి అత్యంత తక్కువ ఎత్తుతో ఇటు అటు తిరుగుతూ చిన్న సైజు విమానంతో పాటు రెండు హెలీకాప్టర్లు తిరుగుతున్నాయని వివిధ గ్రామాల వారు తెలిపారు. ఈ విషయమై పోలీస్ అధికారులను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదని జైపూర్ ఎస్సై శ్రీదర్ తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు సర్వే విషయమై విమానాలు తిరుగుతున్నట్లు తెలుస్తోందని భీమారం ఎస్సై రాములు తెలిపారు. హైవే రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఏరియాల్ సర్వే కొనసాగుతున్నట్లు తెలియవచ్చిందని ఆయన తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మందపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ మోతిలాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు, రైతులకు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన తేమశాతంతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలని రైతులకు సూచించారు. తేమ తగ్గిన ధాన్యాన్ని వెంట వెంటనే తూకం వేస్తూ, గోదాములకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. తూకంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, కొనుగోలు కేంద్ర నిల్వహకులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య పరీక్షలు

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో గురువారం ఆయుర్వేద పరీక్షలు నిర్వహించనున్నట్లు డీజీఎం పర్సనల్ అరవిందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీర్ఘకాలిక రోగాలు బీపీ, షుగర్ వంటి వ్యాధులు, కీళ్లనొప్పులు, నడుము నొప్పులు, వంటి వాటికి పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

19లోగా దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

వివిధ ట్రేడులలో అనుభవం ఉన్న ప్రయివేటు అభ్యర్థులు ఈ నెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి, శిక్షణశాఖ ఆధ్వర్యంలో ఐటీఐ ట్రేడులలో అనుభవం ఉన్న అభ్యర్థులకు ఏఐటీటీ అండర్(సిటీఎస్) పరీక్షకు హాజరు కావడానికి అవకాశం కల్పించిందన్నారు. ఐటిఐ వివిధ ట్రేడులలో మూడు సంవత్సరాల అనుభవం ఉండి, 21 సంవత్సరాలు నిండిన వారు ఎన్‌టీసీ సర్టిఫికెట్ పొందుటకు వరంగల్ ములుగు ఎక్స్ రోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐ-2. కళాశాల, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 9866435005, 8106794500 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మొరం తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని గ్రామ శివారులో అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నా మూడు ట్రాక్టర్లను జేసీబీని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరళించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. రెవెన్యూ అధికారులకు అప్పజెప్పినట్లు వివరించారు.



నేరాల నియంత్రణకు కార్డెన్‌సెర్చ్

- ఎస్ఐ రాజావర్ధన్



నవతెలంగాణ-జన్నారం

గ్రామాల్లో నేరాలను నియంత్రించేందుకు కార్డెన్‌సెర్చ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జన్నారం ఎస్ఐ రాజా వర్ధన్ తెలిపారు. బుధవారం మండలంలోని సింగరాయిపేట గిరిజన గ్రామంలో సీఆర్పీఎఫ్, టీఎస్ఎస్పీ, సిబ్బందితో కలిసి కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజవర్ధన్ రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నియమాలను ఉల్లంగిస్తే చర్యలు తప్పవని, గంజాయి గుడుంబా సేవించిన, విక్రయించిన చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే పొలాలు, చేనుల చుట్టూ అక్రమ విద్యుత్ కంచెలు వేయకూడదని, అలా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును వినియోగించుకోవాలని సూచించారు.

జన్నారం వాసికి గౌరవ డాక్టరేట్

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని అక్కపెల్లిగూడాకు చెందిన జాడి రాజేంద్ర కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ ఫార్మసీ విభాగంలో ప్రొఫెసర్ ఎస్ శ్రీను నాయక్ పర్యవేక్షణలో ఫార్మలేషన్ డెవలప్మెంట్ అండ్ క్యారెక్టర్ ఆఫ్ గ్యాస్ట్రో డెలివరీ సిస్టం అనే అంశంపై చేసిన పరిశోధనపై డాక్టరేట్ అందుకున్నారు. అక్కపెల్లిగూడెం నివాసి అయిన జాడి రాజలింగు-తులసి దంపతుల ద్వితీయ కుమారుడు రాజేంద్ర కుమార్ చిన్నప్పటినుండి చదువులోనూ ఆటల్లోనూ చురుగ్గా ఉండేవాడు. పాఠశాల విద్యాభ్యాసం జన్నారంలోని ప్రభుత్వ పాఠశాలలో ముగించుకొని ఉన్నత చదువులు హైదరాబాదులో పూర్తి చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్ అందుకున్నారు. రాజేంద్ర కుమార్ డాక్టరేట్ అందుకోవడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు రాజకీయ నాయకులు ఉద్యోగ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్పత్తి లక్ష్యసాధనకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలి

- జైపూర్ ఎస్టీపీపీని దేశంలో అగ్రభాగాన నిలపాలి
- సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) డి.సత్యనారాయణరావు

నవతెలంగాణ-జైపూర్

2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేషిత ఉత్పత్తి సాధించడానికి ప్రతి ఉద్యోగిలక్ష్యసాధకు కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) డీ సత్యనారాయణ రావు కోరారు. ఉత్పత్తి హెచ్చు తగ్గుల విషయమై బుధవారం రాష్ట్ర ఎస్ఎల్‌డీసీ ఆదేశాల మేరకు అధికారులతో సమావేశమైన ఆయన ఉత్పత్తి హెచ్చు తగ్గులను ప్లాంటు సమర్థవంతంగా తట్టుకుని పారామీటర్స్ అన్ని సక్రమంగా ఉండేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా అధికారులకు ఈ విషయమై తగిన సూచనలు, సలహాలు, తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ఎస్టీపీపీలో పర్యటించారు. అదే రాత్రి సింగరేణి ఎస్టీపీపీ అధికారులతో పాటు కార్పోరేట్ అధికారులతో సమావేశమైన ఆయన ఎస్టీపీపీ ఉత్పత్తి తీరును అడిగి తెల్సుకున్నారు. ప్లాంట్ పీఎల్ఎఫ్ పెంచడం ద్వార అధిక ఉత్పత్తి సాధించి వేసవి కాలంలో విద్యుత్ కొరత రానివ్వకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తిలో గణనీయమైన ప్రగతిని సాధించాలని తద్వార రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడంలో మన వంతు పాత్ర పోషించాలని సూచించారు. రాష్ట్రంతో పాటు దేశంలో విద్యుత్ సరఫరాలో తమ భాగస్వామ్యం ఉండాలని పిలుపునిచ్చారు. నిర్దేషిత లక్ష్యాలను సాధించడంలో తీసుకోవల్సిన చర్యలపై సమీక్ష చేసి అవసరమైన ఆదేశాలను, అనుమతులు ఇచ్చారు. ప్రతి సంధర్భంలో పొదుపు పాటిస్తూ విద్యుత్ ఉత్పత్తి ఖర్చును తగ్గిస్తూ అధిక యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించి రాష్ట్ర ప్రజలకు తక్కువ ధరతో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి కృషి చేయాలని సూచించారు. సౌర విద్యుత్ కేంద్రాల నిర్వాహణ చూసుకూంటూ సౌర విద్యత్‌ను కూడా ఉత్పత్తి చేయాలని తెలిపారు. ప్లాంట్ నిర్వాహణలో విద్యుత్ ఉత్పత్తిలో రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్లాంట్ ఈడీ బసివి రెడ్డి, జీఎం సోలార్ జానకీరామ్, జీఎం వర్క్‌షాప్ ఫిజరాల్డ్, చీఫ్ పవర్ ప్రాజెక్టు ఎస్‌వీకే విశ్వనాధరాజు, ఏజీఎం ఫైనాన్స్ సుధాకర్, ఏజీఎం కే వెంకటేశ్వర్ రావు, ఏజీఎం ఎంఎస్‌వీ రమణ, ఎస్ఓటూ ఈడీ ప్రభాకర్ పాల్గొన్నారు.


అధికారులతో సమావేశమైన డైరెక్టర్ సత్యనారాయణ

24న సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయండి

- స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి

నవతెలంగాణ-నస్పూర్

ఏప్రిల్ 24వ తేదీన టీబీజీకేఎస్ సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి కోరారు. బుధవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 24వ తేదీన గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో టీబీజీకేఎస్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్మికుల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయడంతో పాటు నూతన కమిటీని ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. 134 సంవత్సరాల సింగరేణి చరిత్రలో తొలిసారి 70 మిలియన్ టన్నుల బొగ్గు సాధించడం హర్షనీయమని ఉద్యోగులకు బహుమతులను అందించాలన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల జ్ఞాపకం స్మారక స్థూపం స్మృతి వనం ఏర్పాటు చేసేందుకు మే డేలోగా నిర్ణయం తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరారు. వేలం లేకుండా బొగ్గు బ్లాక్ లను సింగరేణి కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెట్టెం లక్ష్మణ్, పానుగంటి సత్తయ్య, బండి రమేష్, తొంగల రమేష్, సంతోష్, శ్రీనివాస్, రమేష్, రాజునాయక్ పాల్గొన్నారు.

